క్లుప్తంగా

మినీ జాబ్‌మేళా రేపు

వాకాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 21న మంగళవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని అన్నారు. మేనకూరు సెజ్, నాయుడుపేట గ్రీన్‌టెక్, శ్రీసిటీ మొబైల్ కంపెనీల వారు ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పాసైన యువతీ యువకులకు చక్కని ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. నెలకు కనీస జీతం రూ.11,500, రూ.13,500 తోపాటు ఉచిత రవాణ అలాగే హాస్టల్ వసతి కల్పిస్తారని చెప్పారు.

నేటి స్పందన రద్దు

గూడూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అమలు చేసే క్రమంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాలన్నీ రద్దుచేస్తున్నట్లు ఆదివారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఈ నెల 20, 27, మార్చి 6, 13, 20 తేదీల్లో స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదని అన్నారు. దీనిని డివిజన్‌లోని ప్రజలు గుర్తించి స్పందన కార్యక్రమానికి హాజరు కావొద్దని పేర్కొన్నారు.

స్పందన రద్దు

చిల్లకూరు: సమస్యలను పరిష్కరించే క్రమంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు గుర్తించాలని కోరారు.

కోటి మహామంత్ర జప పూజలు



కోటి సార్లు మహామంత్రం జపం చేస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వళ్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయంలో స్వామివారి పేరుతో కోటి సార్లు మహామంత్రం జపం జరిపే పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈనెల 16 నుంచి ఆలయం వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పేరుతో కోటిసార్లు పఠించే మహామంత్రం జప పూజలను వేద పండితులు చేస్తున్నారు. జూలై 13 తేదీ వరకు మహామంత్రం జపం జరుపుతున్నట్లు ఆదివారం వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

వాకాడు: మండలంలోని కొండూరు ఉప్పర పాళెం గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బట్టా వెంకటయ్య, లక్ష్మమ్మ దంపతుల పూరింట్లో విద్యుత్ వైర్లు ఒకదానిపై ఒకటి పడడంతో మంటలు చెలరేగి పూరిల్లు పూర్తిగా కాలిబూడిదైంది. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

వెంకటగిరిరూరల్: గ్రామశివార్లలోని వ్యవసాయ భూముల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై వెంకటగిరి ఎస్‌ఐ జిలానీ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. 10మందిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మొగళ్లగుంట గ్రామ వ్యవ సాయ భూముల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,200 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పచ్చిమిర్చి సాగు.. ఆదాయం బాగు



పచ్చిమిర్చి కోస్తున్న కూలీలు

- ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పచ్చిమిర్చిని గ్రేడింగ్ చేసి బస్తాల్లో నింపుతున్న రైతులు

పెళ్లకూరు: వరి, చెరకు పంటలను సాగు చేయలేక ఎక్కువమంది రైతులు పచ్చిమిర్చి ఏపుగా సాగుచేస్తున్నారు. ఒకప్పుడు మెట్ట ప్రాంతాలకే పరిమితమైన మిర్చిసాగు ప్రస్తుతం మండలంలోని కానూరు, తాళ్వాయిపాడు, రోసనూరు, చావలి, చెంబడిపాళెం, దొడ్లవారిమిట్ట, పెన్నేపల్లి, జీలపాటూరు, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు, పిడికిటిమాల, యడపూడి ప్రాంతాల్లో విస్తృతంగా సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఇక్కడ రైతులు పండించే నాణ్యమైన పచ్చిమిర్చిని ఢిల్లీ, ఆగ్రా, చెన్నై, బెంగళూరు, విజయవాడ పట్టణాలకు ఎగుమతి చేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు.

మేలు రకం మిరప జాతులు..

మండలంలోని వివిధ ప్రాంతాల్లోని రైతులు మేలు రకం మిరప జాతులను సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ముఖ్యంగా కానూరు, రోసనూరు, బంగారంపేట, శిరసనంబేడు మెట్టప్రాంత రైతులు ఉద్యానవన అధికారుల సూచనలు పాటిస్తూ మిరపసాగులో తేలికపాటి జాగ్రత్తలు పాటిస్తూ తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. మిరపలో ప్రియాంక, ఇండాం-5, ఇండాం-67, నయనతార-525 రకాలను పండిస్తున్నారు. రైతులు విత్తనాలు ఎంపికలో జాగ్రత్తలు తీసుకుని వాతావరణం, భూసారాన్ని మేరకు పంటల ఎంపిక చేసుకుంటున్నారు. నాణ్యమైన పచ్చిమిర్చితో పాటు అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ఇక్కడి అన్నదాతలు ఈ ఏడాది 2,570 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు.

లాభాల బాటలో..

మండలంలోని వివిధ ప్రాంతాల్లో పచ్చిమిర్చి పండించే రైతులు అధిక లాభాలు సాధిస్తున్నారు. గతంలో ఇక్కడి రైతులకు మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం వల్ల పండుమిర్చి వచ్చేదాక పంటను పొలంపైనే వదిలి సేద్యం చేసేవాళ్లు. దాంతో ఎండుమిర్చిని అక్కడక్కడ పల్లె ప్రాంతాల్లోను, పట్టణాల్లో విక్రయించుకునేవాళ్లు. కానీ ప్రస్తుతం పచ్చిమిర్చికి మంచి గిరాకీ ఉండడంతో గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నేరుగా వ్యవసాయ పొలం వద్దకు చేరుకుని రైతుల నుంచి పచ్చిమిర్చి కొనుగోలుచేస్తున్నారు. అదేవిధంగా పలు కంపెనీలు వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలను కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తుండడంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో రవాణా ఖర్చు కూడా తగ్గిందని రైతులు అంటున్నారు. ఒకప్పుడు కేజీ పచ్చిమిర్చి రూ.15 నుంచి రూ.20 వరకు ఉండేది. ప్రస్తుతం ఒక కేజీ పచ్చిమిర్చి రూ.40 నుంచి రూ.50 వరకు గిరాకీ ఉంది. ఒక ఎకరం పచ్చిమిర్చి సాగుకు రూ.60 వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు పెడుతున్న రైతులు 30 నుంచి 35 టన్నులు వరకు దిగుబడి సాధిస్తున్నారు. దీంతో రూ.2లక్షలకు పైగా ఆదాయం పొందుతుండడం విశేషం.

మిర్చి సాగు మేలు



వర్షాలు సమృద్ధిగా కురవడంతో వ్యవసాయ బోర్ల నుంచి పుష్కలంగా సాగు నీరు అందుతోంది. వరి, చెరకు సాగుచేయడం కంటే మిర్చి సాగు రైతులకు మేలు. మెట్ట ప్రాంత రైతులతో పాటు మండలంలోని అన్నిచోట్ల పచ్చిమిర్చి సాగు ఏపుగా చేస్తున్నారు.

– బాలకృష్ణయ్య, రైతు, చెంబడిపాళెం

కష్టానికి ఫలితం



ఒకప్పుడు వరిసాగుతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ నష్టపోయాం. దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు నేరుగా పొలం వద్దకు చేరుకోవడం, రైతులతో నేరుగా సంప్రదించి పచ్చిమిర్చి కొనుగోలు చేయడంతో మంచి లాభాలు వస్తున్నాయి.

– కె.బాలసుబ్రమణ్యం, రైతు, తాళ్వాయిపాడు

కార్యకర్తలకు అండగా ఉంటా!



సమస్యల వినతి పత్రాలు చూస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమస్యల పరిష్కారంకు తన వంతుకృషిచేస్తూ అండగా ఉంటానని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆయన నివాసంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కలిసి సమస్యలపై అర్జీలను అందజేశారు. నేదురుమల్లి మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇక దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా వాకాడు సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో సోమవారం ఉదయం 9గంటలకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు చెలికం శంకరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వి.కార్తీక్‌రెడ్డి, ఎన్.వేణునాయుడు, మాజీ ఎంఎంసీ చైర్మన్ పి.రామారావు, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, బి.రమేష్‌రెడ్డి, టి గణేష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రొంటాల చిన్నా, కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బి అనీల్‌కుమార్‌రెడ్డి, కూనా మల్లిఖార్జున్, బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాదమాల లక్ష్మీ నారాయణరెడ్డి, ఎన్.రమణారెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, సైదాపురం మాజీ ఎంపీపీ మన్నారపు రవికుమార్, వి జనార్దన్ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.20లక్షలు



కోటలో రోడ్డు మరమ్మతు పనులు

కోట: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మరమ్మతులకు రూ.20లక్షలు నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ అరుణమ్మ తెలిపారు. కోట బజారువీధిలో రోడ్లు గుంతలమయంగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కోటకు వచ్చిన గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు రోడ్లు బాగు చేయించాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందాయి. స్పందించిన ఆర్డీఓ ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించి రోడ్ల దుస్థితిపై చర్చించారు. ఉన్నతాధికాలతో మాట్లాడారు. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు రోడ్ల మరమ్మతులకు రూ.20లక్షలు మంజూరు చేసినట్లు డీఈఈ తెలిపారు. కోటక్రాస్ రోడ్డు నుంచి బజారువీధి మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు మరమ్మతు పనులను అధికారులు ప్రారంభించారు.

విన్నమాల సప్లయ్ చానల్ పరిశీలన



నీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి విన్నమాల సప్లయ్ చానల్(కాలువ)కు కొద్ది రోజులుగా వదులుతున్న నీటిని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. పట్టణం నుంచి విన్నమాల చెరువు వరకు మూడు కిలోమీటర్లకు పైగా ఉన్న కాలువను నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా మున్సిపల్ కార్మికులతో పలుచోట్ల కాలువల్లో వ్యర్థాలను సైతం తొలగిస్తున్నారు. స్వర్ణముఖి నదిలో ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేసి విన్నమాల చెరువుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. దీంతో విన్నమాల చెరువుకు అనుబంధంగా ఉన్న పలు చెరువులకు సైతం సాగు నీరు అందే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పట్టణ పరిధిలో ఉన్న కాలువల్లో నీరుఫరా జరుగుతుండడంతో దోమల బెడద చాలావరకు తగ్గుతుందని విన్నమాల సప్లయ్ చానల్‌కు నీరు విడుదల చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

చురుగ్గా బాక్స్‌టైప్ బ్రిడ్జి పనులు



జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

దొరవారిసత్రం: మండల పరిధిలోని పోలిరెడ్డిపాళెం, మేలుపాక, దొరవారిసత్రం గ్రామ సమీపంలో రైలు గేట్ల ద్వారా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అండర్ పాస్ బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. భవిష్యత్‌లో రైలు వేగాన్ని దృష్టిలో పెట్టుకుని ఈప్రాంతాల్లోని రైలుగేట్లు తొలగించి అండర్ పాస్ బ్రిడ్జీలు నిర్మించి వీటి ద్వారా వాహన రాకపోకలు సాగించే విధంగా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే రైలు పట్టాలు కింద బ్రిడ్జి పనులు పూర్తి చేసి కాంక్రీట్‌తో రోడ్డు నిర్మాణ పనులు రైలు పట్టాలకు అటుఇటు చకచకా సాగుతున్నాయి. ఒక్కో బ్రిడ్జి రూ.5–6కోట్లు వ్యయంతో నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ పనులు మార్చికంతా పూర్తి అవుతాయని అధికారులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

రాపూరు: ఉరేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాపూరు మండలంలో చోటుచేసుకుంది. రాపూరు మండలం పంగిలి గ్రామానికి చెందిన తిరుపతి లక్ష్మీనారాయణ (78) గ్రామ సమీపంలోని కొండేరువాగు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందినట్లు గ్రామస్తులు ఆదివారం గుర్తించినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వరావు తెలిపారు. అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేశారు.

భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథం



భగవద్గీతను తీసుకున్న వారితో ప్రతినిధులు

డక్కిలి: హిందూ సనాతన ధర్మం పాటించే వారు తప్పక భగవద్గీతను పఠించాలని త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధసేవా సమితి పాదలకూరు అధ్యక్షుడు పెంచల్ నరసయ్య తెలిపారు. మార్లగుంట, తోపుగని, వెంబులూరు, కమ్మపల్లి, రామాపురం గ్రామాల్లో ఆదివారం హిందూ ధర్మప్రచారం నిర్వహించారు. అనంతరం పలువురికి భగవద్గీతను అందజేశారు. కిషోర్, కొండయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ, సరోజనమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాపూరు: గుండవోలు గ్రామానికి చెందిన గంగోటి ప్రతాప్, ఆయన కుమార్తె వైష్ణవి, కుమారుడు సిద్ధార్థ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ నాయకులు, పారిశ్రామిక వేత్త పాపకన్ను మధుసూదన్‌రెడ్డి వారి కుటుంబానికి ఆదివారం రాత్రి రూ. 50వేలు ఆర్థికసాయాన్ని జేసీఎస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రతాప్ తండ్రి పురుషోత్తంకు ఈ నగదును అందజేశారు. నేతలు విశ్వనాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారాసింహారెడ్డి, కలపాటి మధురెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరమణారెడ్డి, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆట విడుపుగా క్రికెట్ పోటీలు



విజేత సాగరమిత్రలతో మత్స్యశాఖాధికారులు

చిల్లకూరు: విధి నిర్వహణలో తలమునకలుగా ఉండే వారికి ఒకింత ఆటవిడుపుగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశామని తిరుపతి జిల్లా మత్స్యశాఖ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయ అన్నారు. కలవకొండ గ్రామసమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి క్రీడా మైదానంలో ఆదివారం తిరుపతి జిల్లాలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న సాగరమిత్రలు, మత్స్యశాఖ సహాయకులు 40 మందికి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల కాలంలో మత్స్యశాఖ అభివృద్ధిపై దృష్టి సారించందని అన్నారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో లైవ్ ఫిష్ అందించేలా ఫిష్ ఆంధ్ర దుకాణాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇలా పనుల్లో మునిగిపోతున్న సిబ్బందికి కొంత ఆట విడుపుగా ఉంటుందని జిల్లా అధికారులు క్రికెట్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో సాగర మిత్రలు, మత్స్యశాఖ సహాయకులు విడివిడిగా పోటీ పడగా సాగరమిత్ర జట్టు విజయం సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఎఫ్‌డీఓ స్టీఫెన్, కోట మత్స్యశాఖాధికారి రెడ్డి నాయక్, నాయుడుపేట మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో అడిషనల్ కమిషనర్



అడిషినల్ కమిషనర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏసీ

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామిని ఆదివారం దేవదాయశాఖ అడిషినల్ కమిషనర్ రామచంద్రమోహన్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన్ను దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీవారి పట్టువస్త్రాలను, చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను దేవస్థాన వేదపండితుల ఆశీర్వాదాలు అందుకున్నారు. ఆయన వెంట ఏసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

కల్యాణం..కమనీయం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు



సూళ్లూరుపేట: ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు



శివపార్వతుల కల్యాణం



ఏరూరులోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో కల్యాణం



గూడూరు: కల్యాణవీరభద్ర స్వామి గ్రామోత్సవం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో వెలసియున్న సుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సాగిన ఈ కల్యాణోత్సవంలో సుబ్రమణ్యం గ్రామ సమీపంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ఏకాంతసేవ నిర్వహించారు.

కనులపండువగా కల్యాణం

నాయుడుపేటటౌన్: మహాశివరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని మండల పరిధిలోని పలు ఆలయాల్లో ఆదివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలతో పాటు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసి ఉన్న అన్నపూర్ణేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వర్ణముఖి నది ఒడ్డున వెలసి ఉన్న ప్రసూనాంభ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక హోమపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వీరభద్ర స్వామి గ్రామోత్సవం

గూడూరు: పట్టణంలోని పాత స్టేట్ బ్యాంకు వీధిలోని కల్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకుని శనివారం అర్ధరాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి పట్టణంలోని అన్ని వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూరహారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

చిల్లకూరు: శివరాత్రిని పురస్కరించుకుని శనివారం పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి రాత్రి శివనామ స్మరణ చేస్తూ జాగరాం చేసే క్రమంలో చేడిమాల, ఏరూరు గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించి ఆదివారం ఉదయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఏరూరులోని జ్ఞాన ప్రసూనాంభ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా చేశారు.

సైదాపురం: శివరాత్రి వేడుకలను పురష్కరించుకుని శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గాండ్ల సంఘం ఆధ్వర్యంలో పరమశివుని ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామ పురవీధుల్లో కోలాహలంగా నిర్వహించారు. సైదాపురంలో ఆ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు కేరళ రాష్ట్రానికి చెందిన కళాకారులతో కోలాహలంగా నిర్వహించారు. తురిమెర్ల గ్రామంలో కూడా స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కోట: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ఆదివారం కోట ఎస్సీ గురుకుల పాఠశాల క్రీడామైదానంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 80 మంది అండర్-19 హ్యాండ్ బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. వారికి పోటీలు నిర్వహించి 16 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, పీడీ శ్రీరేష్, అబ్జర్వర్ హేమంత్ పోటీలను పర్యవేక్షించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్టు మార్చి 3 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటొందని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు శ్రీరాములు, సంధాని పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

నాయుడుపేటటౌన్: నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే మార్గంలో గోమతి సమీపంలో పాత ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆటోను ఆదివారం పట్టుకున్నట్లు స్థానిక ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో ఆదివారం నిందితులను హాజరు పరచి సీఐ వివరాలను వెల్లడించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన అక్కుపల్లి లక్ష్మి అదే పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ తోటి సంపత్‌తో మాట్లాడి ఆటో తీసుకుని నాయుడుపేటకు వచ్చారు. ఇక్కడి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలుదారుల మాదిరిగా పలుచోట్ల 93 మద్యం బాటిళ్లు, 12 బీర్లు కొనుగోలు చేశారు. వాటిని ఆటోలో దాచుకుని శ్రీకాళహస్తికి బయలుదేరారు. రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తూ ఆటోను పట్టుకున్నాట్లు వెల్లడించారు. ఆటో సీజ్ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఎస్‌ఈబీ పోలీసులు వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.